
andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
శనివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 32.6 , కనిష్ఠం 25.2
నిర్మల్
జిల్లా వార్తలు
8
శనివారం 18 మే 2024



• నకిలీ డాక్టర్ల వద్ద ఉన్న ఫేక్ సర్టిఫికెట్లను చూపుతున్న అధికారులు



ప్రజల ప్రాణాలతో చెలగాటం!



- అడుగడుగునా నకిలీ వైద్యం
- పుట్ట గొడుగుల్లా బోగస్ డాక్టర్లు, నర్సింగ్ హోంలు
- అర్హతలు లేకున్నా ఆపరేషన్లు
- మెడికల్ కౌన్సిల్ అధికారుల తనిఖీలతో బట్టబయలైన నకిలీలు

నిర్మల్, మే17 (ఆంధ్రజ్యోతి): నిర్మల్ జిల్లాలో గత కొంతకాలం నుంచి యథేచ్ఛగా బోగస్ నర్సింగ్ హోంలు, అక్రమ క్లీనిక్‌లు పుట్టగొడుగుల్లా వెలుస్తూ అమాయకుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయి. చాలామంది కొన్ని ఆసుపత్రుల్లో కాపౌండర్‌లుగా పనిచేసి తామే సొంతంగా క్లీనిక్‌లే కాకుండా ఏకంగా నర్సింగ్ హోంలను సైతం ఏర్పాటు చేస్తున్నారు. ఉన్నతాధికారులంతా ఇక్కడే ఉండి పరిపాలనను పర్యవేక్షించే నిర్మల్ జిల్లాకేంద్రంలోని దాదాపు పందకు పైగా ఈ బోగస్ అనుపత్రులు, నకిలీ డాక్టర్లు కొనసాగుతున్నట్లు వెల్లడైంది. రెండురోజుల క్రితం నేషనల్ మెడికల్ కౌన్సిల్, స్టేట్ మెడికల్ కౌన్సిల్‌కు చెందిన ఉన్నతాధికారుల బృందాలు నిర్మల్ జిల్లాలోని ఈ నకిలీ ఆసుపత్రులు, నర్సింగ్ హోంలపైనా దాడులు చేపట్టి ఈ అక్రమాల గుట్టును రట్టుచేశాయి. అధికారుల తనిఖీల్లో అనేక ఆసక్తికర విషయాలు బయటపడ్డాయి. రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా నిర్మల్ జిల్లాలో పెద్దఎత్తున కొనసాగుతున్న నకిలీ మెడికల్ మాఫియా ద్వారా పేద ప్రజలు తమ విలువైన ప్రాణాలనే కాకుండా వేల రూపాయలు నష్టపోతున్నారంటున్నారు. ఎలాంటి విద్యార్హతలు లేకున్నా మిడిమిడి జ్ఞానంతో వైద్యం చేస్తూ ప్రజల ప్రాణాలను పణంగా పెడుతున్నారు. అయితే వీరు ఆర్ఎంపీ, పీయంపీలుగా చెప్పుకుంటున్నప్పటికీ మేజర్ సర్జరీలు సైతం చేయడమే కాకుండా ఆపరేషన్‌లు చేసి వేల రూపాయలను గడిస్తున్నారు. కాగా అవసరం లేకున్నా యాంటీబయాటిక్స్, పెయిన్ కిల్లర్స్‌ను అంటగట్టి రోగులను మరింత ఇబ్బందుల పాలుచేస్తున్నారంటున్నారు. అయితే వీరి హాస్పిటల్స్‌లోనే ఓ వైపు మెడికల్ షాపులు మరోవైపు డయాగ్నోస్టిక్ లాబోరేటరీలను ఏర్పాటు చేసుకొని వైద్యంతో పాటు వైద్య పరీక్షలన్నీ తమ వద్దే అందుబాటులో ఉంటున్నాయని ప్రచారం చేసుకుంటున్నారు. ఇదిలా ఉండగా కొంతమంది సర్టిఫికెట్ హోల్డర్స్ సైతం తామే డాక్టర్‌లుగా చెప్పుకుంటూ వైద్యం చేస్తున్నట్లు ఫిర్యాదులున్నాయి. మరికొంతమంది చైనా, రష్యాల్లో ఎంబీబీఎస్ సమానంగా చెప్పుకునే ఎండీ సర్టిఫికెట్లతో ఇక్కడ తాము పీజీ డాక్టర్‌లమని ప్రచారం చేసుకుంటున్నారు. ఇంత పెద్దమొత్తంలో నకిలీ వైద్యం దందా కొనసాగుతున్నప్పటికీ జిల్లా అధికారులు ఇటువైపు పట్టించుకోకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అడపాదడపా తూతూమంత్రంగా తనిఖీలుచేస్తున్నా అధికారులు అసలు మూలాల్లోకి వెళ్లకుండా చేతులు దులుపుకుంటున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నేషనల్ మెడికల్ కౌన్సిల్, స్టేట్ మెడికల్ కౌన్సిల్‌అధికారులు రంగంలోకి దిగే వరకు జిల్లా యంత్రాంగం ఇటువైపు చూడకపోవడం పట్ల భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

తనిఖీలతో బట్టబయలైన బాగోతం

నిర్మల్‌లో కొనసాగుతున్న నకిలీ మెడికల్ మాఫియాపై స్థానికులు కొంతమంది నేషనల్ మెడికల్ కౌన్సిల్, స్టేట్ మెడికల్ కౌన్సిల్ అధికారులకు ఫిర్యాదులు చేశారు. ఈ ఫిర్యాదులపై స్పందించిన అధికారులు రెండురోజుల క్రితం ఆకస్మికంగా నిర్మల్‌లో దాడుల పర్వాన్ని కొనసాగించారు. అధికారుల దాడుల్లో కుప్పలు తెప్పలుగా నకిలీ హాస్పిటల్స్ బోగస్ డాక్టర్ల వ్యవహారం వెలుగుచూసింది. దాదాపు 15 మంది నకిలీ డాక్టర్‌లను గుర్తించిన అధికారులు వారిపై కేసులు నమోదుచేశారు. ఎలాంటి అర్హతలు లేకున్నప్పటికీ తాము అర్హులమని చూపుకుంటూ బోగస్ సర్టిఫికెట్లతో ప్రజలకు వైద్యం చేస్తూ వేల రూపాయలు దండుకుంటున్నారు. తమ క్లీనిక్‌ను ఆనుకొనే మెడికల్ షాపులు, డయాగ్నోస్టిక్ లాబోరేటరీలు ఏర్పాటుచేసుకొని అమాయక ప్రజల నుంచి వైద్యచికిత్సల పేరిట పెద్దమొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారంటున్నారు. ఈ నకిలీ వైద్యులు ఆపరేషన్‌లను కూడా చేస్తున్నారంటున్నారు. స్పెషలిస్టు డాక్టర్ల వలే నటిస్తూ యాంటీబయాటిక్స్, పెయిన్ కిల్లర్స్ లాంటి మందులను బలవంతంగా అంటగడుతున్నారని చెబుతున్నారు. అయితే అధికారుల తనిఖీల సమయంలో ఈ నకిలీ డాక్టర్ల హాస్పిటల్స్ దుర్గంధభరితంగా ఉండడం, శుభ్రంగా ఉండకపోవడం లాంటివాటిని కూడా గుర్తించారు.

కార్పొరేట్ స్థాయిలో..

కొంతమంది డిప్లొమా సర్టిఫికెట్ హోల్డర్స్ కార్పొరేట్ స్థాయిలో తామే వైద్యులమని చెప్పుకుంటూ నర్సింగ్ హోంలు, హాస్పిటల్స్‌ను ప్రారంభిస్తున్నా రు. వీటి ప్రారంభ కార్యక్రమాలకు ప్రజాప్రతినిధులను, ఉన్నత అధికారు లను సైతం ఆహ్వానించి పబ్లిసిటీ చేసుకుంటున్నారు. అన్ని వైద్య సౌకర్యాలు తమ వద్దే అందుబాటులో ఉన్నాయని, అవసరమైతే కొంతమంది సూపర్‌స్పెషాలిటీ వైద్యులను హైదరాబాద్ నుంచి రప్పిస్తున్నామని వీరు చెప్పుకుంటున్నారు. గ్రామాల్లో తమకు అక్కడ పనిచేసే స్థానిక ఆర్ఎంపీలను ఏజెంట్లుగా నియమించుకొని వారి ద్వారా రోగులను తమ ఆసుపత్రులకు రప్పించి పెద్దమొత్తంలో ఫీజులు గుంజుతున్నట్లు విమర్శలున్నాయి. అయితే తాము వసూలుచేసే ఫీజుల నుంచి తమకు రిఫర్‌చేసే ఆర్ఎంపీలకు పెద్దమొత్తంలో డబ్బులను చెల్లిస్తున్నారంటున్నారు. డిప్లొమా హోల్డర్లు ఏకంగా తమ ఆసుపత్రుల్లో ఆపరేషన్ థియేటర్‌లను సైతం ఏర్పాటుచేసుకొని రోగుల దీర్ఘకాలిక వ్యాధులకు ఆపరేషన్లు సైతం చేస్తూ వారి ప్రాణాలను పణంగా పెడుతున్నారంటున్నారు. అలాగే మరికొంతమంది డిగ్రీ డాక్టర్ల పేరిట తామే బినామీగా వారి పేరిట వైద్య చికిత్సలు కొనసాగిస్తున్నట్లు మెడికల్ కౌన్సిల్ అధికారులు గుర్తించారు. దీంతో పాటు చైనా, రష్యాల్లో ఎంబీబీఎస్ స్థాయి చదివిన డాక్టర్లు అక్కడి సర్టిఫికెట్ ప్రకారం తాము ఎండీలమని చెప్పుకుంటూ పీజీ డాక్టర్‌లుగా చెలామణి అవుతున్నారు.

అధికారుల తీరుపైనా అనుమానాలు

నిర్మల్‌లో వైద్యారోగ్య శాఖకు సంబంధించిన ఉన్నతాధికారులే కాకుండా పరిపాలనను పర్యవేక్షించే అధికారి ఉన్నప్పటికీ ఈ నకిలీ మెడికల్ దందా యథేచ్ఛగా కొనసాగుతుండడం పట్ల భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సంబంధిత శాఖ అధికారులు సరైన తనిఖీలు, పర్యవేక్షణ చేయకపోవడంతోనే ఈ బోగస్ డాక్టర్‌లు రెచ్చిపోతున్నారన్న ఆరోపణలున్నాయి. అయితే నేషనల్ మెడికల్ కౌన్సిల్, స్టేట్ మెడికల్ కౌన్సిల్ అధికారులు ఇక నుంచి తమకు నిరంతరంగా తనిఖీలు కొనసాగిస్తామంటూ చేసిన ప్రకటన నకిలీ డాక్టర్లను హడలెత్తిస్తోంది.





ఆర్ఎంపీ నిర్వహిస్తున్న హాస్పిటల్‌ను తనిఖీ చేస్తున్న మెడికల్ కౌన్సిల్ అధికారులు



గోదావరిలో పుణ్య స్నానాలు ఆచరిస్తున్న భక్తులు

బాసరలో భారీగా భక్తుల రద్దీ



ప్రధాన ఆలయంలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

బాసర, మే 17: బాసర సరస్వతీ అమ్మవారి పుణ్యక్షేత్రం శుక్రవారం భక్తులతో కిటకిటలాడింది. రోజంతా అమ్మవారి ఆలయం భక్తులతో సందడిగా కనిపించింది. భక్తులు మొదట గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించి గోదారమ్మకు, నది తీరంలో గల శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సరస్వతీ అమ్మవారిని దర్శించుకున్నారు. శుభదినం కావడంతో భక్తులు పిల్లలకు అక్షరశ్రీకార పూజలను జరిపించారు.

ఆధ్యాత్మిక చింతనతో
మానసిక ప్రశాంతత: ఎమ్మెల్యే

భైంసా, మే 17: నిత్యం ఆలయాల సందర్శన చేపడుతూ ఆధ్యాత్మిక చింతనతో నడుచుకుంటే మానసిక ప్రశాంతత చేకూరుతుందని ముథోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర ప్రతినిధి బోస్లే మోహన్‌రావ్ పాటిల్‌లు పేర్కొన్నారు. శుక్రవారం భైంసా మండలంలోని కుంబి గ్రామంలోని విఠలేశ్వర ఆలయంలో కొనసాగుతున్న అఖండ హరినామ సప్తాహలో తమ అనుచరగణం, పార్టీ శ్రేణులతో కలిసి వేర్వేరుగా పాల్గొన్నారు. ఆలయంలో ప్రత్యేకపూజలు చేపట్టి సప్తాహంలో భాగంగా నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దైవ నామస్మరణ చేస్తే భగవంతునికి ప్రీతిపాత్రులవుతామని అన్నారు. ప్రతీఒక్కరు సన్మార్గంలో పయనిస్తూ సత్కార్యాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఇందులో ముథోల్ మాజీ ఎంపీపీ సుభాష్ జాదవ్, లింగా మాజీ సర్పంచు దుప్పె గణేష్, మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు గజానంద్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.



పూజ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం



• రాంపూర్‌లో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్

నర్సాపూర్(జి), మే17: మండలంలోని రాంపూర్ గ్రామంలో డీఆర్డీఏ ఐకేపీ నిర్మల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ సోమ శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ గ్రేడ్ ధాన్యం క్వింటాకు రూ.2203, కామన్ గ్రేడ్ రూ.2183 ప్రభుత్వ మద్దతు ధర ఉంటుదన్నారు. కార్యక్రమంలో గిర్దావర్ వేణుగోపాల్, బుక్‌కీపర్ కృష్ణవేణి, కమిటీ సభ్యులు లక్ష్మి, గంగామణి రైతులు పాల్గొన్నారు.

ఐటీఐ ట్రేడ్లకు దరఖాస్తుల ఆహ్వానం

భైంసా రూరల్, మే 17: మండలంలోని మాటేగాం గ్రామ సమీపంలో ఉన్న సరస్వతి ఐటీఐ కళాశాలలో దరఖాస్తులు ప్రారంభమయ్యాయని కళాశాల ప్రిన్సిపాల్ నవీన్ తెలిపారు. అభ్యర్థులు పదోతరగతి పాసైన అభ్యర్థులు ఈనెల 17 నుంచి జూన్ 16వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ప్రతిఒక్కరూ ఒరిజినల్ సర్టిఫికెట్ స్కాన్ చేసి వెబ్‌సైట్‌లో ఉంచాలని, పదోతరగతి మార్కుల రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రాతిపదికగా ఎంపిక జరుగుతుందని, విద్యార్థిని విద్యార్థులు దరఖాస్తు లు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ నవీన్ కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

దిలావర్‌పూర్, మే 17: విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా శనివారం దిలావర్‌పూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఏఈ శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. ఇందుకు వినియోగ దారులు సహకరించాలని కోరారు.

ఐచర్ వ్యాన్ ఢీకొని ఒకరి మృతి



ప్రమాద స్థలంలో తీవ్రగాయాలతో పడి ఉన్న గణేష్

భైంసారూరల్, మే17: మండలంలోని తిమ్మాపూర్ గ్రామం వద్ద గురువారం రెండుఐచర్ వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కల్లూర్ గ్రామానికి చెందిన రేపని గణేష్ (44) తన సొంత పనుల నిమిత్తం కల్లూర్ నుంచి టూవీలర్‌పై భైంసాకు వస్తున్నసమయంలో రోడ్డుపై ఉన్న ఐచర్ వ్యాన్‌కు ఢీకొని తీవ్ర గాయాలపాలై చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. శుక్రవారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. తండ్రి గంగారాం ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

పేకాట స్థావరాలపై పోలీసుల దాడి

• పేకాటరాయుళ్లపై కేసు.. నగదు స్వాధీనం

నిర్మల్ కల్చరల్, మే17: సోన్ మండలంలో ఎస్పీ ఆదేశం మేరకు పలు గ్రామాల్లో పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. న్యూవెల్మల్ గ్రామ శివారులో పేకాట ఆడుతుండగా 11 మందిని పట్టుకున్నారు. వారి నుంచి రూ.43,500 స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. బొప్పారం గ్రామంలో పేకాడుతున్న ఏడుగురిని పట్టుకుని 12వేలు స్వాధీనపర్చుకున్నారు. పలువురిపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.



వివరాలు నమోదు చేసుకుంటున్న పోలీసులు

అమ్మ ఆదర్శ పాఠశాల పనులను గడువులోగా పూర్తి చేయాలి

• ప్రారంభానికి ముందు ఫొటోలతో కూడిన నివేదికలు ఇవ్వాలి: కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పరిశీలిస్తున్న కలెక్టర్



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శిస్తున్న కలెక్టర్

నిర్మల్ కల్చరల్, మే17: అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన పనులు గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కొండాపూర్‌లో చేపట్టిన పనులు కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. జూన్ 5లోగా పూర్తి చేయాలన్నారు. విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు, నీటి సరఫరా తదితర పనులు చేపట్టాలన్నారు. ప్రారంభానికి ముందు తరువాత ఫొటోలతో కూడిన నివేదికలను అందించాలని ఆదేశించారు. పనుల నిర్వహణలో గ్రామంలోని మహిళా సంఘాల సహకారం తీసుకోవాలన్నారు. ఇన్‌చార్జి అధికారి పనులు పరిశీలించాలన్నారు.

• నిరంతరం ధాన్యం కొనుగోలు చేయాలి

వరి కొనుగోళ్ల ప్రక్రియ నిరంతరం కొనసాగాలని కలెక్టర్ ఆదేశించారు. నిర్మల్ మండలం రత్నాపూర్ కాండ్లీ గ్రామంలోని కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. కేంద్రాలవద్ద రైతులకు ఇబ్బందులు కలుగకుండా అన్ని వసతులు కల్పించాలని ఆదేశించారు. వర్షాలకు ధాన్యం తడవకుండా సరిపడా టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలన్నారు. ధాన్యపు సంచులు కొరత రాకుండా చూడాలని కొనుగోలు వివరాలు ట్యాబ్‌లలో నమోదు చేయాలని అన్నారు. లారీలు, కూలీల సంఖ్య పెంచాలని సూచించారు. నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్రభుత్వ మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేయాలని అన్నారు. డీఈవో రవీందర్ రెడ్డి, పౌర సరఫరాల శాఖ డీఎం శ్రీకళ, సహకార అధికారి నర్సయ్య, ఎంపీడీవోలు, ఇతర అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పనులను త్వరితగతిన పూర్తి చేయండి..

లక్ష్మణచాంద: 'అమ్మ ఆదర్శ పాఠశాల' పథకం కింద మంజూరైన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని నిర్మల్ కలెక్టర్ శుక్రవారం ఆదేశించారు. మండలంలోని పీచర పాఠశాలను ఆకస్మికంగా తనిఖీచేసి ఈ పథకం ద్వారా కొనసాగుతున్న పనుల ప్రగతిని పరిశీలించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులతో మాట్లాడారు. పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని అన్నారు. అనంతరం స్థానికంగా గల వరి కొనుగోలు కేంద్రాలను పరిశీలించి తగు సలహాలు, సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఈవో రవీందర్‌రెడ్డి, మండల ప్రత్యేకఅధికారి ఫాతిమా, పంచాయతీ రాజ్ డీఈ రాజేందర్, ఎంపీడీవో రాంప్రసాద్, ఎంఈవో మధుసూదన్, ఏఈ శ్రీధర్, స్థానిక నాయకులు భూమేష్, కమిటీ అధ్యక్షురాలు హేమలత, మహిళలు పాల్గొన్నారు.

టెట్‌తో సంబంధం లేకుండా ప్రమోషన్లకు కృషి

• ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రఘోత్తం రెడ్డి

నిర్మల్ కల్చరల్, మే 17: టీచర్లకు టెట్‌తో సంబంధం లేకుండా ప్రమోషన్లు ఇప్పించేందుకు కృషి చేస్తామని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి హామీ ఇచ్చారు. శుక్రవారం నిర్మల్ జిల్లా కేంద్రంలోని పీఆర్టీయూ సంఘ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం ఇందుకు సుముఖంగా ఉన్నట్లు చెప్పారు. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత బదిలీలు, పదోన్నతులు చేపట్టేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు. ఆగస్టు 15లోగా పెండింగ్ బిల్లులన్నింటినీ చెల్లించేలా ప్రభుత్వం హామీ లభించిందని తెలిపారు. 50శాతం ఫిట్మెంట్‌తో పీఆర్సీ సాధించేలా ప్రాతినిధ్యం చేసినట్లు వివరించారు. గిరిజన సంక్షేమ శాఖలో ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ చేపట్టేలా ప్రాతినిధ్యం చేసినట్లు తెలిపారు. 2008 డీఎస్సీ ఉపాధ్యాయులకు జీవో 54 ప్రకారం పాత పెన్షన్ వర్తింపజేయడంతో పాటు ఉపాధ్యాయులకు మెరుగైనా ఈహెచ్ఎస్ సేవలు కల్పించేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు. ఉపాధ్యాయులు ఎదుర్కొనే అనేక సమస్యలపై దృష్టిసారించి పరిష్కరిస్తామని స్పష్టంచేశారు. జిల్లాలో పదవీ విరమణ పొందిన పలువురు ఉపాధ్యాయులను ఈ సందర్భంగా రఘోత్తం రెడ్డి సన్మానించారు. ఈకార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నరేంద్రబాబు, ప్రధాన కార్యదర్శి బీవీ రమణారావు, పలు మండలాలకు చెందిన బాధ్యులు పాల్గొన్నారు.



సారంగాపూర్ మండల కేంద్రంలోని ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణం

అత్యవసరానికి అవస్థ..!

• సమస్యలకు కేంద్రంగా సారంగాపూర్ బస్టాండ్
• మరుగుదొడ్లు లేక ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు
• పట్టించుకోని అధికారులు, పాలకులు

సారంగాపూర్, మే17: ప్రతీ ఇంటికి మరుగుదొడ్డి తప్పనిసరని అని చెప్పే పాలకులు, అధికారులు ప్రయాణికులకు మాత్రం బస్టాండ్‌లో మరుగుదొడ్డి వసతి కల్పించడం లేదు. మండల కేంద్రంలో గల బస్టాండ్‌లో మరుగుదొడ్లు ఉన్నా అవి ఎందుకు పనికిరాకుండా నిరుపయోగంగా మారాయి. దీంతో ప్రయాణికులు ఆరుబయటే అవసరాలు తీర్చుకుంటున్న పరిస్థితి దాపురించింది. ఏళ్లుగా ప్రయాణికులు ఈ అవస్థలు పడుతున్న సంబంధిత అధికారులు, పాలకులు మాత్రం పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెలువెత్తుతున్నాయి. సారంగాపూర్ బస్టాండ్ మీదుగా నిత్యం వందలాదిమంది ఇతర ప్రాంతాలకు రాకపోకలు కొనసాగించే ప్రయాణికులకు కనీస వసతులు కరువైపోయాయి. బస్టాండ్ ఆవరణలో మరుగుదొడ్లు, తాగునీటి కుళాయిలు ఉన్నా నిర్వహణ లోపం కారణంగా అవి నిరుపయోగంగా మారాయి. మరుగుదొడ్డి, కుళాయిల చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగిపోయి దుర్గంధ భరితంగా దర్శనమిస్తున్నాయి. ప్రయాణికుల వసతులపై దృష్టి సారించాల్సిన అధికారులు మాత్రం కనీసం పట్టించుకోవడం లేదంటున్నారు. మహిళలు, వృద్ధులు, చిన్నారులు కనీస అవసరాలు తీర్చుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. పారిశుధ్యం లోపించి ప్రయాణికులు నిల్చోలేని పరిస్థితి నెలకొంది. దశాబ్ద కాలంగా ఈ సమస్యలు ప్రయాణికులను వేధిస్తున్న అటు పాలకులు గానీ, అధికారులు గానీ కనీసం కన్నెత్తి చూసిన పాపాన పోవడంలేదని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఈ విషయంపై దృష్టి సారించి వెంటనే బస్టాండ్‌లో ఉన్నటువంటి మరుగుదొడ్లను శుభ్రపరిచి బస్టాండ్‌ను శుభ్రపరిచి వాడకంలోకి తేవాలని కోరుతున్నారు.

ద్విచక్ర వాహనం బోల్తా : ఒకరి మృతి

పెంబి, మే 17: ద్విచక్ర వాహనం బోల్తా ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన మండల కేంద్రంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్సై శంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఖానాపూర్ మండలంలోని అడవి సారంగాపూర్ గ్రామానికి చెందిన సీడం సోనేరావు పెంబి మండలంలోని గుమ్మెన గ్రామంలో తన చుట్టాల ఇంటికి వెళ్లాడు. తిరుగుప్రయాణంలో పెంబి, వేణునగర్ గ్రామ సమీపంలో బైక్ అదుపు తప్పి బోల్తాపడడంతో సోనేరావు (56) అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి ఇద్దరు కొడుకులు, కూతురు, భార్య ఉన్నారు.



ఘటనా స్థలం వద్ద సోనేరావు మృత దేహం

ముగిసిన అఖండ హరినామ సప్తాహ

ఇచ్చోడ, మే 17: ఇచ్చోడ మండల కేంద్రంలోని విఠలేశ్వర ఆలయం లో గత వారంరోజుల నుంచి కొనసాగుతున్న అఖండ హరినామా సప్తహ శుక్రవారంతో ముగిసింది. ముగింపు సందర్భంగా బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ హాజరై ప్రత్యేక పూజలను చేశారు. ఆధ్యాత్మికతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఆయన సూచించారు. ప్రతీ ఒక్కరు భక్తి మార్గంలో నడవాలని, ధర్మం వెంట ఉండాలని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైష్ణవ సదన్ నారాయణ మహారాజ్, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డును సందర్శించిన ఎమ్మెల్యే

ఇచ్చోడ, మే 17: మండల కేంద్రంలోని మార్కెట్ యార్డ్‌ను శుక్రవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సందర్శించారు. మార్కెట్ యార్డులో ఉన్న సమస్యలను స్థానిక రైతులను అడిగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్ యార్డుకు కావాల్సిన రెండు షెడ్డులకు ప్రతిపాదనలు పంపాలన్నారు. రైతులు చెప్పిన సమస్యలను విన్న ఎమ్మెల్యే వెంటనే కలెక్టర్‌ను ఫోన్‌లో సంప్రదించి ఇచ్చోడ ప్రాంత రైతుల సమస్యలను పరిష్కరించేలా తగు చర్యలు చేపట్టాలని విన్నవించారు. అనంతరం రైతులతో కాసేపు ముచ్చటించారు. కార్యక్రమంలో ఎంపీపీ నిమ్మల ప్రీతంరెడ్డి, ఎంపీటీసీ శివకుమార్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.


ఇచ్చోడ మార్కెట్ యార్డులో పర్యటిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పూర్తి చేయండి

అధికారులకు సీఎస్ ఆదేశం


వీసీలో మాట్లాడుతున్న సీఎస్



నిర్మల్ కల్చరల్, మే 17 : అమ్మ ఆదర్శ పాఠశాలను కమిటీల సహకారంతో పూర్తి చేయాలని సీఎస్ శాంతికుమారి కలెక్టర్లను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శుక్రవారం ఆదేశించారు. పెండింగ్ ధరణి దరఖాస్తులు, సీఎం ప్రజావాణి, వరి ధాన్యం కొనుగోళ్లు, సీఎంఆర్ బియ్యం ప్రక్రియపై సమీక్షించారు. కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ అమ్మఆదర్శ పాఠశాల పనులు కొనసాగుతున్నాయని వివరించారు. ఏకరూప దుస్తులు పంపిణీకి చేపట్టిన చర్యలు తెలిపారు. వరి ధాన్యం కొనుగోళ్లు, సీఎంఆర్ బియ్యం ప్రక్రియపై చేపట్టిన చర్యలు వివరించారు. గడువులోగా అన్ని పూర్తి చేస్తామన్నారు. ప్రజావాణి, ధరణి దరఖాస్తుల పూర్తికి చర్యలు తీసుకుంటున్నట్లు స్పష్టంచేశారు. అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, డీఆర్‌వో భుజంగరావు, ఆర్డీవోలు రత్న కళ్యాణి, కోమల్ రెడ్డి, డీఈవో రవీందర్‌రెడ్డి హాజరయ్యారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో దాహం.. దాహం!

● తాగునీటి వసతి కల్పనలో నిర్లక్ష్యంగా అధికారులు ● ఇబ్బందుల్లో కార్యాలయాల సందర్శకులు

భైంసా, మే 17: వివిధ పనుల నిమిత్తం ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే ప్రజలు ఆయా కార్యాలయాల్లో నీటి వసతి లేక అవస్థ పాలవుతున్నారు. దాహార్తి తీర్చుకునేందుకు గానుతంటాలు పడాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం మండే ఎండల్లో ప్రభుత్వ కార్యాలయాల్లో తాగేందుకు నీరు దొరకక అగచాట్ల పాలు కావాల్సి వస్తోంది. ప్రధానంగా ప్రజల రద్దీ అధికంగా ఉండే కార్యాలయాల్లో సైతం సంబంధిత అధికారులు వేసవి కాలంలో సైతం నీటి వసతి కల్పించకపోవడం పట్ల సర్వత్రా విమర్శలు విన్పిస్తున్నాయి.

రెవెన్యూ డివిజన్ కేంద్రమైన భైంసా పట్టణ పరిధిలో ప్రతీ నిత్యం ఆర్‌డీవో, తహసీల్, ఎంపీడీవో, ఎంఈవో, సబ్ రిజిస్ట్రార్, మున్సిపల్, అగ్రికల్చర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయాల్లో అర్జీదారులు, వినియోగదారులు, రైతులు లబ్ధిదారుల రాకపోకలు అధికంగా ఉంటాయి. ఈ కార్యాలయాల్లో ఉదయం పని వేళలు ప్రారంభమైన సమయం నుంచి ముగిసే సమయం వరకు రద్దీ నెలకొని ఉంటుంది.


భైంసా తహసీల్ కార్యాలయంలో తాగునీటి కోసం ఏర్పాటుచేసిన కుండలు

ఇలాంటి కార్యాలయాల్లో నిర్వాహణాధికారులు ప్రస్తుత వేసవి కాలంలో తాగు నీటి వసతి కల్పనపై దృష్టి సారించలేదు. సంబంధిత కార్యాలయాల్లో పనులు నిమిత్తం వచ్చే వారు ఉదయం నుంచి సాయంత్రం వరకు వేచి చూడాల్సిన పరిస్థితులు ఉంటాయి. అయితే ఈ కార్యాలయాల్లో తాగు నీటి వసతి లేకపోవడంతో పనులు నిర్వాహణ నిమిత్తం వచ్చిన వారు తమ తమ దాహార్తిని తీర్చుకునేందుకు గాను నీటిని కొనుగోలు చేసి తాగాల్సిన దుస్థితి నెలకొని ఉంది. నీటి వసతి లేకపోవడంతో ఆయా కార్యాలయాల ముందు గల హోటళ్లు, విక్రయ కేంద్రాలకు వెళ్లి నీటి పాకెట్లు, బాటిళ్లకు కొనుగోలు చేసుకొని తాగుతున్నారు. ఇక్కడి తహసీల్దార్ కార్యాలయంలో రెండు రంజన్ల ద్వారా తాగునీటి వసతి ఏర్పాటుచేయగా మిగతా ప్రభుత్వ కార్యాలయాల్లో నామమాత్రంగానైనా తాగునీటి వసతి కల్పించలేదు. నిత్యం వేలాది మంది ప్రయాణించే బస్టాండ్‌లో తాగునీటి వసతి ఉన్నా లోపలి బాగంలో ఉండటంతో ప్రయాణీకులు నీటి పాకెట్లను కొనుగోలు చేసుకొని దాహార్తిని తీర్చుకుంటున్నారు. ఉన్నతాధికారులు ఈ విషయంలో స్పందించి కనీసం వేసవి కాలం ముగిసే వరకైనా ప్రభుత్వ కార్యాలయాల్లో తాగునీటి వసతిని కల్పించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

'ఆదివాసీ యువకుడిపై దాడి చేసినవారిపై చర్యలు తీసుకోవాలి'


మాట్లాడుతున్న రాయిసిడం జంగు

గుడిహత్నూర్, మే17: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని జైనూర్ మండల కేంద్రంలో ఇటీవల ఆది వాసి యువకుడు మర్సకోల లక్ష్మణ్ పై దాడికి పాల్పడిన వారిపై అధికా రులు చర్యలు తీసుకోవాలని ఆదివా సీ సేవ జిల్లా అధ్యక్షుడు రాయిసిడం జంగుపటేల్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రశాంత వాతావరణం లో 144 సెక్షన్ నడుమ ఎన్నికలు జరుగుతున్న సమయంలో కొందరు అల్లరిమూకలు, అసాంఘిక శక్తులు దాడికి పాల్పడటం శోచనీయమన్నారు. దాడిజరిగిన నేటికీ వారిపై చర్యలు తీసుకోకపోవడం పూర్తిగా అధికారుల నిర్లక్ష్యంతో పాటు, ఆదివాసుల పట్ల పూర్తి వివక్ష చూపిస్తున్నారని ఆరోపించారు.


ఆదిలాబాద్ ఆసుపత్రిలో రత్నాకర్ మృతదేహం

విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి

బోథ్, మే17: మండలంలోని కౌటా(బి) గ్రామానికి చెందిన మాకునూరి రత్నాకర్ (24) యువకుడు ఆదిలాబాద్‌లో విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందాడు. ఆదిలాబాద్‌లో తమ అత్తగారి ఇంటికి వెళ్లి అక్కడే ఉంటూ మేస్త్రీగా పనులు చేసుకుం టున్నాడు. అయితే మేస్త్రీ పని చేస్తుండగా విద్యుత్‌షాక్‌కు గురై మృతిచెందడంతో ఆయన స్వగ్రామమైన కౌటా (బి)లో విషాదఛా యలు అలుముకున్నాయి. అందరితో కలుపుగోలుగా ఉండే ఈయన మృతిచెందాడని విషయం తెలియడంతో ఆయన బంధువర్గంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడికి భార్య ఉంది.

ప్రభుత్వ కళాశాలలో చేరాలని

కుభీర్‌లో అధ్యాపకుల ప్రచారం

కుభీర్, మే 17: ప్రభుత్వ కళాశాలలో చేరాలని మండల కేంద్రం కుభీర్ జూనియర్ కళాశాల అధ్యాపకులు శుక్రవారం ప్రచారం నిర్వహించారు. మండల కేంద్రం కుభీర్‌లో పదోతరగతి పాస్ అయిన విద్యార్థుల వద్దకు వెళ్లి వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. ప్రభుత్వం ఉచితంగా ఇంటర్ విద్యను అందజేస్తున్నదని, అనుభవజ్ఞులైన అధ్యాపకులతో నాణ్యమైన బోధన, ఉచిత పుస్తకాల పంపిణీ, తదితర వసతులను వివరించి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇందులో అధ్యాపకులు ఎన్ హన్మంత్‌రావు, శేఖర్, మహేష్, పాల్గొన్నారు.

క్రీడాకారులకు నగదు అందజేత

నేరడిగొండ, మే17: నేరడిగొండ మండలంలో జరుగనున్న నేరడిగొండ ప్రీమియర్ లీగ్‌లో యువ క్రీడాకారులను ప్రోత్సహించడానికి యువకుడు తిత్రేజైరామ్ వారి తండ్రి స్వర్గీయ క్రిశే.తిత్రేప్రేమ్‌సింగ్ జ్ఞాపకార్థం లీగ్‌లో పాల్గొనే ఇండియన్ బ్లేజర్స్ జట్టు సభ్యులకు క్రీడా దుస్తుల కోసం రూ.10వేల నగదును అందజేశారు. కార్యక్రమంలో జట్టు కెప్టెన్ లఖన్‌సింగ్, లీగ్ నిర్వాహకులు జాదవ్‌పవన్‌కుమార్, పాండు, మణిరాజ్, అనిల్, దినేష్, గణేష్, సిద్దులు పాల్గొన్నారు.

కంది శ్రీనివాస్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం


దిష్టిబొమ్మ దగ్ధం చేస్తున్న దృశ్యం

తాంసి, మే 17: కాంగ్రెస్ నాయకుడు కంది శ్రీనివాస్‌రెడ్డి గంద్రత్ సుజాతపై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా శుక్రవారం మండల కేంద్రంలో మండల బీసీ సంఘం నాయకులు శ్రీనివాస్ రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ముందుగా గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం స్థానిక ప్రధాన కూడలిలో శ్రీనివాస్‌రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేసి చెప్పులతో కొట్టారు. కార్యక్రమానికి పురస్కరించుకుని శ్రీనివాస్‌రెడ్డిని వెంటనే అరెస్టు చేయాలంటూ పోలీసులకు బీసీ కులస్థులు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో నాయకులు సతీష్, గంగన్న, సుధాకర్ ఉన్నారు.

ఉరి వేసుకుని యువతి ఆత్మహత్య

ఇంద్రవెల్లి, మే17: ఉరి వేసుకుని ఓ యువతి ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం మండలకేంద్రంలోని గోండ్‌గూడలో చోటుచేసుకుంది. కుటుంబీకులు, ఎస్సై దుబ్బాక సునీల్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని కొబ్బయ్‌గూడ గ్రామానికి చెందిన పెండోర్ భీంరావు, ఇంద్రబాయి దంపతులకు చెందిన పెండోర్ సుమిత్ర (26) గత నాలుగునెలలుగా కడుపు నొప్పితో బాధపడుతోంది. కుటుంబీకులు పలు ఆసుపత్రులకు తీసుకెళ్లి వైద్యం అందించిన ఆరోగ్యం కుదుట పడలేదు. శుక్రవారం ఉదయం గోండ్‌గూడలో ఉంటున్న తమ బంధువుల ఇంటికి వచ్చిన సుమిత్ర కడుపునొప్పి తగ్గడం లేదని క్షణికావేశంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుని మృతిచెందింది. గమనించిన కుటుంబీకులు మృతురాలు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న ఎస్సై ఘటనా స్థలానికి చేరుకుని సుమిత్ర ఆత్మహత్యకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. తండ్రి భీంరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పంచనామా నిర్వహించి పోస్టుమార్టం కోసం ఉట్నూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

శాఖాపరమైన పనుల్లో రెవెన్యూ సిబ్బంది

బోథ్, మే 17: మొన్నటి వరకు ఎన్నికల బిజీలో మునిగిన అధికారులు శుక్రవారం నుంచి శాఖపరమైన పనులు నిమగ్నమయ్యారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా స్థానిక రెవెన్యూ సిబ్బందితో పాటు తహసీల్దార్ ఎన్నికల అధికారులు సమయం అంతా ఎన్నికల నిర్వహణపై కేటాయించారు. అయితే ఎన్నికలు ముగిసిన రెండవ రోజు నుంచి రెవెన్యూ సిబ్బంది శాఖపరమైన పనుల్లో నిమగ్నమయ్యారు. అత్యవసర పనులపై వచ్చిన మండల ప్రజలు నివాస, కుల ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం ఇబ్బందులు పడ్డారు. ఎన్నికల విధుల కారణంగా అత్యవసరమైన దరఖాస్తులను మాత్రమే అధికారులు పరిశీలించారు. ఎన్నికలు ముగిసిన వెంటనే వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలతో తహసీల్దార్ కార్యాలయం నిండిపోయింది. అయితే అధికారులు సైతం ప్రజలకు అవసరమైన దరఖాస్తులను పరిశీలిస్తూ క్లియర్ చేస్తున్నారు.


తహసీల్దార్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న రెవెన్యూ ఉద్యోగులు

మెరుగైన విద్యుత్ సరఫరాకు ముమ్మర చర్యలు

భైంసా, మే17: డివిజన్ పరిధిలో వినియోగదారులకు ఎలాంటి అంతరాయాలు లేకుండా మెరుగైన రీతిలో విద్యుత్ సరఫరా అందించేందుకు ట్రాన్స్‌కో అధికారులు ప్రణాళికబద్ధమైన ముమ్మర చర్యలు చేపడుతున్నారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని భైంసా, కుభీర్, ముథోల్, తానూర్ మండలాల పరిధిలో ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు సరఫరా నిలిపివేసి సబ్‌స్టేషన్లకు అవసరమైన మరమ్మతు పనులు నిర్వహించారు. ఫీడర్ల వారీగా ఏఈలు, లైన్‌మెన్లు, లైన్ ఇన్‌స్పెక్టర్లు మరమ్మతు పనుల్లో పాల్గొన్నారు. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే సంబంధిత ప్రాంత ట్రాన్స్‌కో అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో ఇక్కడి ట్రాన్స్‌కో అధికారులు విద్యుత్ సబ్ స్టేషన్లకు ఎప్పటికప్పుడు అవసరమైన మరమ్మత్తు చర్యలు చేపడుతున్నారు. సబ్‌స్టేషన్ల నిర్వాహణ వ్యవస్థను పకడ్బందీగా నిర్వహిస్తున్నారు. ఇక్కడి ప్రాంత డీఈ, ఏడీఈ, ఏఈలతో సమన్వయంతో వ్యవహరించుకుంటూ సబ్‌స్టేషన్లు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. లైన్లలో లోపాలు ఏర్పడకుండా తరచూ తనిఖీలు చేపడుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద సమస్యలు ఏర్పడకుండా పరిశీలనలు చేపడుతున్నారు. అంతరాయం లేని సరఫరా అందించే దిశగా ముమ్మరంగా చర్యలు చేపడుతున్నారు.


భైంసా సబ్ స్టేషన్‌లో మరమ్మతు పనులు నిర్వహిస్తున్న విద్యుత్ సిబ్బంది

పాఠశాలల ప్రారంభం లోగా ఏకరూప దుస్తులు అందజేయాలి

ఆసిఫాబాద్ రూరల్, మే 17: విద్యా ర్థులకు ఏకరూప దుస్తులను జూన్12వ తేదీలోగా అందజేయాలని కలెక్టర్ వెంక టేష్ దోత్రే అన్నారు. ప్రభుత్వ పాఠశా లల్లో చదువుతున్న విద్యార్థులకు ఏక రూప దుస్తుల కోసం పంపిణీ చేసిన గుడ్డను జిల్లాకేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో జిల్లా విద్యాధికారి అశోక్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పాఠశాలల ప్రారంభం కంటే ముందే ఏకరూప దుస్తులు పంపిణీ చేయాలన్నారు. విద్యార్థుల కొలతల ఆధారంగా గుడ్డ అందజేయాలని సూచిం చారు. మండలాల్లో ఏర్పాటు చేసిన సెంటర్ల ద్వారా పని త్వరితగతిన పూర్తి చేసేలా చూడాలన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి అశోక్‌మాట్లాడుతూ జిల్లాలో 25,322 మంది విద్యార్థినులు, 22,926 మంది విద్యార్థులకు మొత్తం 48248విద్యార్థులకు ఏకరూప దుస్తులు అందించనున్నట్లు తెలిపారు. దీనికిగాను 1,96,031 మీటర్ల బట్టను కత్తిరించి రేపటిలోగా మండలాలకు చేరే విధంగా ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. మండలంలో ఏర్పాటుచేసిన వివిధసెంటర్లలో సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ మెంబర్లతో ఏకరూప దుస్తులని కుట్టిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి అడిష నల్‌డైరెక్టర్ రామకృష్ణ, సమగ్రశిక్ష కోఆర్డినేటర్ మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి..

మొక్కల పెంపకంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. శుక్రవారం ఆసిఫాబాద్‌మండలం అడ గ్రామపంచాయతీ ఆధ్వ ర్యంలో నిర్వహిస్తున్న నర్సరీని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీచేశారు. వేసవిదృష్ట్యా నర్సరీలోని మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం మొక్కలకు నీరందించి తగురక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతిగౌడ్, డీఎల్‌పీవో ఉమర్ హుస్సేన్, కార్యదర్శిసిబ్బంది పాల్గొన్నారు.

పనులు నాణ్యతతో చేయాలి

కెరమెరి: అమ్మఆదర్శ పాఠశా లల్లో పనులను నాణ్యతతో చేపట్టా లని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. శుక్రవారం మండలంలోని గోయగాం జిల్లా పరిషత్ పాఠశాల, ఎంపీపీఎస్ పాఠశాలలో మహిళాసంఘాల ఆధ్వ ర్యంలో చేపడుతున్న పనులను ఆయన పరిశీలించారు.



ట్రాఫిక్‌తో రద్దీగా మారి కనిపిస్తున్న అంబేద్కర్‌రోడ్డు



శివాజీచౌక్, అంబేద్కర్‌చౌక్ వెళ్లే ప్రాంతంలో ఇష్టారీతిన పార్కింగ్

అడ్డదిడ్డంగా ట్రాఫిక్

- నిబంధనలకు విరుద్ధంగా లోడింగ్ అన్‌లోడింగ్
- రోడ్లపైనే యేదేచ్ఛగా వాహనాల పార్కింగ్
- ఇబ్బందుల్లో పట్టణవాసులు, ప్రయాణికులు

ఆదిలాబాద్ అర్బన్, మే 17: రోజురోజుకు పెరిగి పోతున్న పట్టణ జనాభా దృష్ట్యా జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ అంతకంతకూ పెరిగిపోతునే ఉంది. దీనికి తోడు అనునిత్యం జిల్లా కేంద్రానికి వేలాదిమంది వచ్చిపోతుండటంతో సమస్య మరింత తీవ్రమవు తోంది. ట్రాఫిక్‌ను నియంత్రించి ప్రజలకు ఇబ్బం దులు తలెత్తకుండా చర్యలు చేపట్టాల్సిన ట్రాఫిక్ పోలీసులు చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. ట్రాఫిక్ ఆంక్షలు ఎక్కడా అమలుకు నోచుకోక పోవడంతో యదేచ్ఛగా రోడ్లపైనే పార్కింగ్ చేయడం, పట్టణంలోని అన్ని ప్రధాన కూడళ్లల్లో వ్యాపార, వాణిజ్య సముదా యాల వద్ద నిబంధనలకు విరుద్ధంగా లోడింగ్, అన్‌లోడింగ్ జరుగుతుండటంతో ప్రజలు నానా అవస్థలు పడాల్సి వస్తోంది. అలాగే జిల్లా కేంద్రంలో ఎక్కడ పడితే అక్కడ యదేచ్ఛగా వాహనదారులు తమ వాహనాలను పార్కింగ్ చేస్తుండటంతో ట్రాఫిక్‌అస్తవ్యస్తంగా మారుతోంది. నిబంధనలను ఖాతరు చేయకుండా రోడ్లపైనే వాహనాలను నిలిపి ఉంచుతున్నారు. పట్టణంలోని ప్రధాన కూడళ్లు దేవిచంద్‌చౌక్, గాంధీచౌక్, అంబే ద్కర్‌చౌక్, అశోక్‌రోడ్డు, పంజాబ్‌చౌక్ తదితర ప్రాం తాల్లో నిత్యం ట్రాఫిక్ అవస్థలు తప్పడంలేదు. వాణిజ్య సముదాయాల ముందు పార్కింగ్ కోసం స్థలం లేకపోవడంతో రోడ్లపైనే వాహనాలను నిలి పివేస్తున్నారు. దీంతో రాకపోకలకు తీవ్ర అంత రాయం ఏర్పడుతోంది.

అంతా నిబంధనలకు విరుద్ధంగానే..

రాత్రి 10 గంటల తర్వాత మాత్రమే వాణిజ్య వ్యాపార సంస్థల యజమానులు తమ సరుకుల ను లోడింగ్ అన్‌లోడింగ్ చేయాలనే నిబంధనలు ఉన్నాయి. కానీ అవి ఎక్కడ అమలైన దాఖలాలు కనిపించడం లేదు. వ్యాపారులు ఇష్టారాజ్యంగా ప ట్టపగలే భారీవాహనాల్లో సరుకులు తెప్పించుకొని లోడింగ్ అన్‌లోడింగ్‌లు చేస్తున్నారు. అనునిత్యం రద్దీగా ఉండే ప్రాంతాల్లో ట్రాఫిక్ నిబంధనలను పాటించక పోవడంతో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఒక్కో సందర్భంలో ట్రాఫిక్ సమస్య తలెత్తి రాక పోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుంది. కొన్ని సందర్భాల్లో ప్రయాణికులు ఘర్షణలకు దిగడం కనిపిస్తుంది. అయినా అధికా రులు అటు వైపు చూసినట్లే కనిపించడం లేదు. ఇప్పటికైన అధికారులు స్పందించి ప్రజలకు ఇబ్బం దులు కలుగకుండా చూడాలని పట్టణ వాసులు కోరుతున్నారు.





వీసీలో పాల్గొన్న కలెక్టర్, అదనపు కలెక్టర్

పనుల నిర్వహణలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలి

● రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతికుమారి

ఆసిఫాబాద్ రూరల్, మే 17: రాష్ట్రంలో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభి వృద్ధి పనుల నిర్వహణలో అధికారులు బాధ్యతా యుతంగా వ్యవవహరిం చాలని రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా అన్నిజిల్లాల కలెక్టర్‌లు, అదనపు కలెక్టర్లు, విద్యా, పౌరసరఫరాలశాఖ అధికారులతో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో పనులనిర్వహణ, ధరణిలో పెండింగ్ దరఖాస్తుల పరి ష్కారం, ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తుల పరిష్కారం, వరిధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ, రైస్‌మిల్లులకు ధాన్యం తరలింపు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ అభివృద్ధి పథకాలను అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి అందే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో పాఠశాలల అభివృద్ధి పనులు వేగవంతం చేయాలన్నారు. ధరణి, ప్రజావాణి కార్యక్రమాల్లో అందిన దరఖాస్తులపై క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించే దిశగా దృష్టి సారించాలని ఆదేశించారు. వరిధాన్యం కొనుగోలు చేసి నిర్ణయించిన మద్దతు ధరను అందించాలన్నారు. ఈ క్రమంలో ప్రతిరైతు లబ్ధి పొందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ట్యాగింగ్ చేయబడిన రైస్‌మిల్లులకు సామర్థ్యానికి అనుగుణంగా తరలించాలని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో జిల్లాలో 685ప్రభుత్వ పాఠశాలల్లో పనులు చేపట్టామన్నారు. ప్రతి పాఠశాలలో విద్యుత్, తాగునీరు, మూత్రశాలలు, తరగతి గదుల మరమ్మ తులు, బాలికలకు ప్రత్యేక మూత్రశాలలు తదితర పనులపై నాణ్యతపాటించే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లాలో 37కొనుగోలు కేంద్రాలద్వారా ధాన్యం కొనుగోలు చేస్తున్నామన్నారు. ప్రజావాణి, ధరణిలో వచ్చినసమస్యలను పరిష్కరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్‌లు దీపక్ తివారి,దాసరి వేణు, ఆర్డీవోలు సురేష్, డీఈవో అశోక్ ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

కౌటాల గ్రామాన్ని సందర్శించిన కేంద్ర బృందం



పనులను పరిశీలిస్తున్న కేంద్ర బృందంసభ్యులు

కౌటాల, మే 17: కౌటాల గ్రామ పంచాయతీని గురువారం కేంద్ర భూగర్భగనులశాఖ, కేంద్ర జలసంఘం అధికార బృందం సందర్శించింది. దేశవ్యాప్తంగా ఉత్తమ గ్రామపంచాయతీ ఎంపికలో భాగంగా కౌటాల గ్రామ పంచాయతీని కేంద్ర జలసంఘం సీనియర్ శాస్త్రవేత్త దివాకర్ మహంతా, సబ్‌డివిజన్ ఇంజనీర్ సతీష్‌కుమార్ బృందం సందర్శించింది. దేశ వ్యాప్తంగా 185గ్రామాలు ఎంపిక చేయగా నేషనల్ వాటర్ అవార్డు కోసం ఈ ఎంపిక జరుగుతుండగా ఇప్పటికే దేశవ్యాప్తంగా 25గ్రామాలను పునఃపరిశీలిస్తున్నారు. దక్షిణ భారత దేశంలో ఎనిమిది గ్రామాలు ఎంపిక కాగా అందులో ఏడు గ్రామాలు తెలంగాణ నుంచే ఉన్నట్లు వారు పేర్కొన్నారు. ఏడు గ్రామాల్లో కౌటాల పంచాయతీ ఎంపికకాగా ఇక్కడి వాస్తవ పరిస్థితులను పరిశీలించారు. ఇందులో వర్షపు నీరు ఒడిసిపట్టి భూమిలో ఇంకేలా చేసిన పనులలను పరిశీలించారు. గ్రామంలోనిర్మించిన ఇంకుడుగుంతలు ఏ విధంగా పనిచేస్తు న్నాయని అదే విధంగా కంకాలమ్మ గుట్టపై నుంచి వచ్చే నీటిని ఏ విధంగా నిలువ చేస్తున్నారో పరిశీలించారు. ఈ అవార్డు ఎంపికలో నీటిసంరక్షణ, వినియోగం, వినూత్న ఆలోచనలు, ఉపాధి కల్పన, పథకాల అమలు అన్నిటిని కలిపి 100మార్కులు ఇస్తామన్నారు. వాస్తవ పరిస్థితులపై కేంద్రానికి నివేదిక అందజేస్తామన్నారు. దీనిద్వారా అవార్డు ఎంపిక జరుగుతుందన్నారు. కార్యక్ర మంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, ఐటీసీ కో ఆర్డినేటర్ మల్లేష్, ఎంపీపీ విశ్వనాథ్, టీంసభ్యుడు పోశెట్టి, ఎంపీడీవో నస్రుల్లాఖాన్, ఏపీవో పూర్ణిమ, డీటీ సంతోష్, వాటర్‌షెడ్ ఈవో షైమద్, పంచాయతీ కార్యదర్శి సాయికృష్ణ తదితరులు ఉన్నారు.

నేషనల్ సాఫ్ట్ బేస్‌బాల్ పోటీల్లో జిల్లా క్రీడాకారిణి ప్రతిభ



గోల్డ్ మెడల్‌తో విద్యార్థిని స్ఫూర్తి

చింతలమానేపల్లి, మే 17: మండలంలోని కర్జవెల్లికి చెందిన ఆగాడి నారాయణ, మోహిని దంపతుల కుమార్తె స్ఫూర్తి ఈ నెల 15నుంచి 17వరకు నేపాల్‌లో ఇండియా, నేపాల్ మధ్య జరిగిన నేషనల్ సాఫ్ట్‌బేస్ బాల్ పోటీల్లో మంచిప్రతిభ కనబర్చి గోల్డ్ మెడల్ సాధించినట్లు తెలంగాణ సెక్రెటరీ దుర్గం గురువేందర్ తెలిపారు. కాగా స్ఫూర్తి సిర్పూర్(టి) బాలికల గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతుండగా చిన్నప్పటి నుంచి క్రీడలపై ఆసక్తి కనబర్చింది. కాగా జాతీయ పోటీల్లో ప్రతిభ కబర్చడం పట్ల స్ఫూర్తిని పలువురు అభినందించారు.



మాకోడి-కాగజ్‌నగర్ వరకే పూర్తి అయిన మూడో ట్రాక్

పురోగతి లేని మూడో ట్రాక్ పనులు

- తరుచూ రైళ్ల నిలిపివేత
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- గత్యంతరం లేక బస్సులు, జీపుల్లో ప్రయాణం
- రవాణా చార్జీలు అధికమవుతున్నాయని ఆవేదన

కాగజ్‌నగర్, మే 17: సికింద్రాబాద్-ఢిల్లీ వరకు మూడో ట్రాక్ పనులు మూడేళ్ల క్రితం ప్రారంభించిన ప్పటికీ పనుల్లో పురోగతి లేదు. దీంతో తరుచూ రైళ్ల ను రద్దు చేస్తుండటంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. కాగజ్‌నగర్ మీదుగా నిత్యం హైదరా బాద్, వరంగల్‌కు 50ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్ల ద్వారా ప్రయాణికులు తమతమ గమ్యస్థానాలు చేరు కుంటారు. మూడో ట్రాక్ పనులు సికింద్రాబాద్-ఢిల్లీ వరకు చేస్తున్నారు. మాకోడి-కాగజ్‌నగర్, కాగజ్‌నగ ర్-రెబ్బెన, రెబ్బెన-తాండూరు, బెల్లంపల్లి-మంచిర్యాల, మంచిర్యాల-రామగుండం, పెద్దపల్లి-హసన్‌పర్తిరోడ్డు, కాజీపేట-సికింద్రాబాద్ బిట్స్‌గా చేసి మూడో ట్రాక్ పనులను చేపడుతున్నారు. మహారాష్ట్రలోని బల్లార్షా-మాకోడి వరకు ట్రాక్ పనులు నడుస్తుండగా, మా కోడి నుంచి కాగజ్‌నగర్ వరకు మూడో ట్రాక్ పను లు పూర్తిచేశారు. ఇందుకు ట్రయల్స్ కూడా పూర్తి చేశారు.

వేంపల్లి ట్రాక్ మధ్యలో పులుల బ్రీడింగ్ కేంద్రం ఉండటంతో నేషనల్ టైగర్ మానిటరింగ్ సెల్ బృం దం సర్వేలను ఏడాది క్రితం చేపట్టింది. ఈ సర్వేల్లో అండర్ పాసింగ్ బ్రిడ్జి నిర్మించాలని సూచించింది. అలాగే ట్రాక్‌తో వన్యప్రాణులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పూర్తి సూచనలు, సలహాలు అందజే శారు. ప్రస్తుతం కాగజ్‌నగర్-రెబ్బెన, రెబ్బెన-తాం డూరు వరకు మూడో ట్రాక్ పనులు నడుస్తున్నాయి. పనులు వేగంగా సాగటం లేదు. అలాగే తరుచూ ట్రాక్ మళ్లింపులు చేస్తుండటంతో ఎక్స్‌ప్రెస్, ప్యాసిం జర్ రైళ్లను రద్దు చేస్తున్నారు. ప్రతి రెండు నెలలకొక మారు పది రైళ్లు రద్దు చేయటంతో కాగజ్‌నగర్ మీదుగా హైదరాబాద్‌కు వెళ్లే ప్రయాణికులు ఇబ్బం దులు పడుతున్నారు.గత్యంతరం లేక బస్సుల ద్వారా పట్టణాలకు వెళ్లాల్సి వస్తోందని పలువురు ప్రయాణి కులు పేర్కొంటున్నారు. రైలు ప్రయాణానికి, ఆర్టీసీ ప్రయాణానికి మూడురెట్లు అదనంగా ప్రయాణ చార్జీలు చెల్లించాల్సి వస్తోందని తెలిపారు.

మూడో ట్రాక్ పనులు నిరంతరం కొనసాగించి పూర్తిచేస్తే సికింద్రాబాద్ నుంచి కాగజ్‌నగర్‌కు వచ్చే రైళ్లు నిర్ణీత సమయంలో వచ్చే అవ కాశాలున్నాయి. ప్రస్తుతం భాగ్యనగర్, పుష్‌పుల్ రైళ్లను రద్దు చేశారు. మంచిర్యాల, కాజీపేట, హైదరాబాద్ ప్రాంతాలకు వెళ్లే వారు ఉదయం పూటనే భాగ్య నగర్, ప్యాసింజర్ రైలు ద్వారా వెళ్లేవారు. ప్రస్తుతం ఈ రెండు రైళ్లు రద్దు చేయటంతో ఆటోలు, జీపులు, ఆర్టీసీ బస్సుల ద్వారా వెళ్తున్నారు. ఈ మార్గంలో అండర్ బ్రిడ్జిల నిర్మాణం పూర్తి అయినప్పటికీ కూడా మూడో ట్రాక్ పనులు ఇంకా పూర్తి కావటం లేదు.

మూడోట్రాక్ పనులు త్వరగా పూర్తి చేయాలి..

లెండుగురే శ్యాంరావు, కాగజ్‌నగర్




మూడో ట్రాక్ పనులు ఆశించిన మేర నడువటం లేదు. తరుచూ ఎక్స్‌ప్రెస్ రైళ్లు, ప్యాసింజర్ రైలు రద్దు చేయటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసరమున్న వారు జీపులు, ఆటోలు, బస్సుల ద్వారా పోవాల్సి వస్తోంది. చాలా కష్టం అవుతుంది. రైలు ప్రయాణం అందరికి ఉపయోగపడేట్లు ఉంటుంది. బస్సు ప్రయా ణం మూడింతలు అధికమవుతోంది. చాలా కష్టమవుతోంది.

నాన్‌స్టాప్ ప్రయాణం..

మూడు ట్రాక్ పనులు పూర్తి అయితే సికింద్రాబాద్-ఢిల్లీ సూపర్‌ఫాస్ట్ రైళ్లకు ఎలాంటి అడ్డు లేకుండా నేరుగా వెళ్లేం దుకు చక్కటిమార్గం ఉంటుంది. ప్రస్తుతం సికింద్రాబాద్ నుంచి కాగజ్‌నగర్‌కు వచ్చే రైలు భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్‌లో మంచిర్యాల వరకు బాగానే వస్తుండగా, బెల్లంపల్లికి రాగా నే ఇతర ఎక్స్‌ప్రెస్‌లు వస్తుండటంతో వివిధస్టేషన్లలో హాల్ట్ ఇస్తున్నారు. దీంతో కాగజ్‌నగర్‌కు రాత్రి 10గంటలకు రావా ల్సిన భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ నిర్ణీత సమయానికి ఎన్నడూ రావటం లేదు. అదనంగా గంట సమయం తీసుకుంటుం దని పలువురు పేర్కొంటున్నారు. మూడోట్రాక్ పనులు పూర్తిచేస్తే ఎక్స్‌ప్రెస్ రైళ్లు, సూపర్‌ఫాస్టు రైళ్లు ఆగకుండా పోయే అవకాశం ఉంది. ఇప్పటికైనా రైల్వే అధికారులు వెం టనే స్పందించి మూడోట్రాక్ పనులను వేగంగా పూర్తి చే యాలని కోరుతు న్నారు.



నిర్మించిన మూడో ట్రాక్



మూడో ట్రాక్ పనుల కోసం తెచ్చిన మెటీరియల్



ఆర్కే ఓసీపీలో మిషన్ లైఫ్ కార్యక్రమం

రామకృష్ణాపూర్, మే 17: రామకృష్ణాపూర్ ఓసీపీ నందు శుక్రవారం మిషన్ లైఫ్ కార్యక్రమంలో భాగంగా హరితర్యాలీ, మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఓసీపీ ప్రాజెక్టు అధికారి ఎం గోవిందరావు మాట్లాడుతూ ఉద్యోగులు ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలన్నారు. ప్రతిఒక్కరు తమ జీవన శైలిని మార్చుకొని ఆరోగ్యాలను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆర్కే ఓసీపీ మేనేజర్ సుధీర్, ఏఐటీయూసీ బ్రాంచి సెక్రెటరీ అంజనేయులు, ఇతర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న ప్రాజెక్టు అధికారి గోవిందరావు, తదితరులు

ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలి: జీఎం

శ్రీరాంపూర్, మే 17: ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని శ్రీరాంపూర్ ఏరియా జీఎం బి సంజీవరెడ్డి అన్నారు. అంత ర్జాతీయ రక్తపోటు దినోత్సవం, మిషన్ లైఫ్ పర్యా వరణ అవగాహన సందర్భంగా శుక్రవారం ఆర్కే8 డిస్పెన్సరీలో నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల కోసం డిస్పెన్స రీల్లో అన్ని వైద్య సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. అత్యాధునిక పరికరాలు ఉన్నాయని, వినియోగించుకోవాలని కోరారు. రక్తపోటును నియం త్రించుకోవడానికి ప్రతిరోజు వ్యాయామం చేయాలన్నారు. ఆహారంలో మార్పులు చేసుకో వాలని సూచించారు. భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని కల్పించేందుకు ఇప్పటినుంచే ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని కోరారు. అనంతరం ఉపన్యాస పోటీల్లో గెలుపొందిన ఉద్యోగులకు జీఎం బహుమతులు అందించారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎంవో డాక్టర్ రమేష్‌బాబు, ఏజీఎం (ఫైనాన్స్) మురళీధర్, డీజీఎం(వర్క్‌షాప్) రవీందర్, డీజీఎం(సివిల్) ఆనంద్ కుమార్, డాక్టర్ మురళీధర్, పర్యావరణ అధికారి హన్మాన్‌గౌడ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మైదానాన్ని పరిశీలించిన జీఎం..

న్యూనాగార్జునకాలనీలో ఉన్న ప్రాణహిత మైదా నాన్ని జీఎం బి సంజీవరెడ్డి శుక్రవారం సందర్శిం చారు. ఉద్యోగులు, పరిసరప్రాంత ప్రజల సౌకర్యా ర్థం అన్నిహంగులతో మైదానాన్ని ఏర్పాటు చేసి నట్లు చెప్పారు. ఇందులో బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్ కోర్టులు ఏర్పాటు చేయాలని, లైటింగ్ మెరుగుపర్చాలని, మైదానంలోకి వాహనాలు, పశువులు రాకుండా కట్టు దిట్టమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీజీఎం (వర్క్‌షాప్) రవీందర్, డీజీఎం (సివిల్) ఆనంద్ కుమార్, ఇన్‌చార్జి డీజీఎం (పర్సనల్) రాజేశ్వర్, ఇంజ నీర్లు సతీష్ చక్రవర్తి, సత్య నారాయణ, సీనియర్ పీవో కాంతారావు, స్పోర్ట్స్ సూపర్ వైజర్ చాట్లఅశోక్, కో-ఆర్డినే టర్ తోటసురేష్, తదితరులు పాల్గొన్నారు.



రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయాలని వినతిపత్రం ఇస్తున్న మధుసూదన్ రెడ్డి

రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయండి..


ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రక్తనిధి కేంద్రంలో రక్తనిల్వలు నిండుకున్నందున సింగరేణి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయాలని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర నిర్వహణ కమిటీ సభ్యుడు, మంచి ర్యాల రక్తనిధి కేంద్రం ఇన్‌చార్జి వి మధుసూదన్ రెడ్డి కోరారు. ఈ మేరకు ఆయన శుక్రవారం శ్రీరాంపూర్ ఏరియా జీఎం బి సంజీవరెడ్డికి వినతి పత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లా డుతూ, వేసవిలో అధిక ఉష్ణోగ్రతలు, సార్వత్రిక ఎన్నికల సందర్భంగా రక్తదానం చేసేందుకు ఎవరూ ముందుకు రాలేదన్నారు. ఈ కారణంగా రక్తనిధి కేంద్రంలో రక్తనిల్వలు తగ్గిపోయాయని తెలిపారు. దీంతో సికిల్‌సెల్, తలసే మియా వ్యాధిగ్రస్తులు, గర్భిణులు, అత్యవసరంగా రక్తం అవసరం ఉన్న వారు ఇబ్బందులకు గురవుతున్నా రన్నారు. సింగరేణి ఆధ్వర్యంలో పలుమార్లు రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి పెద్దమొత్తంలో రక్తం అందిస్తున్నట్లు తెలిపారు. వెంటనే నూత నంగా శిబిరం ఏర్పాటు చేసి కార్మికుల నుంచి రక్తం సేకరించి తమకు అందజేయాలని కోరారు. ఆయన విజ్ఞప్తికి జీఎం సానుకూలంగా స్పందిం చారు. మధుసూదన్‌రెడ్డి వెంట ఇండియన్ రెడ్ క్రాస్ జిల్లా శాఖ కార్యదర్శి చందూరి మహేందర్ ఉన్నారు.

కార్మికులపై పని ఒత్తిడి తగ్గించండి

శ్రీరాంపూర్, మే 17: కార్మికులపై పనిఒత్తిడి తగ్గిం చాలని ఐఎన్‌టీయూసీ బ్రాంచ్‌ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్ రావు అన్నారు. శుక్రవారం ఆర్కే5 గనిని యూనియన్ నాయకులు సందర్శించి కార్మికులసమస్యలు తెలుసుకు న్నారు. మేనేజర్‌కు వినతిపత్రం ఇచ్చి పరిష్కారానికి కృషిచేయాలని కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, కొంతమంది అధికారులు, కొంతమంది కార్మికులను లక్ష్యం గా చేసుకొని ఉద్దేశపూర్వకంగా పనిభారం మోపుతూ ఒత్తిడికి గురిచేస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి చర్య లను వెంటనే మానుకోవాలని లేదంటే ఆందోళనలు చేప డతామని ఆయన హెచ్చరించారు. పని స్థలాల్లో వెంటిలే షన్ సౌకర్యం కల్పించాలని, టూల్‌బాక్స్‌లు ఏర్పాటు చేయాలని, మ్యాన్ రైడింగ్‌ను నిర్ణీత సమయంకంటే పది నిమిషాల ముందు నడిపించాలని, క్యాంటీన్‌లో మెరుగైన వసతులు కల్పించాలని, రెస్ట్‌హాల్, లాకర్ ఏర్పాటు చేయా లని కోరారు. కార్యక్రమంలో యూనియన్ కేంద్రఉపాధ్య క్షుడు కలవేనశ్యాం, కార్యదర్శి మల్లారెడ్డి, ఏరియా కార్యద ర్శులు చందు, మోహన్, నదయ్య, మహేందర్ రెడ్డి, పిట్ కార్యదర్శి శ్రీనివాస్, అసిస్టెంట్ పిట్ కార్యదర్శి సంబయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం అందజేత

కాసిపేట, మే 17: రెండు నెలల క్రితం కాసిపేట 2వ గనిలోవిధులు నిర్వహిస్తూ ప్రమాదవశాత్తూ మృతిచెందిన సీనియర్ మైనింగ్‌సర్దార్ మచ్చ రమేష్ కుటుంబానికి గనికార్మికులు శుక్రవారం రూ.1.10లక్షల ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ పిట్ కార్యదర్శి గొల్లశ్రీనివాస్, మైనింగ్ స్టాఫ్ ఇన్‌చార్జి సుభాష్‌చంద్రబోస్, మైనింగ్ సర్దార్‌కేతన్, వినోద్, టీబీజీకేఎస్ నాయకులు సారంగపాణి, సీఐటీయూనాయకులు సురేష్, కారుకూరి తిరుపతి, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.





ఫర్టిలైజర్ దుకాణంలో తనిఖీలు చేస్తున్న అధికారులు

నకిలీ విత్తన.. ముప్పు!



● అధికారులు పట్టుకున్న నకిలీ విత్తనాలు (ఫైల్)





- జిల్లాలో వానాకాలం సీజన్ సమీపిస్తుండడంతో మొదలైన దళారీ దందా
- ఇప్పటికే వేసవి దుక్కులను పూర్తి చేసి.. పంటచేలను చదును చేసిన రైతులు
- వారం రోజుల్లో ఎప్పుడు తొలకరి వర్షం కురిసినా.. విత్తనాలను విత్తేందుకు సిద్ధం
- ఉద్దెర పేరుతో రైతులను మాయ చేస్తున్న వ్యాపారులు
- నకిలీ విత్తనాలను అంటగట్టే ప్రయత్నం
- 'మామూళ్లు'గానే తీసుకుంటున్న సంబంధిత వ్యవసాయ శాఖాధికారులు
- జిల్లావ్యాప్తంగా 300 పైగా ఎరువులు, విత్తన దుకాణాలున్నా.. అనధికారికంగా ఉన్నవి మరెన్నో..

ఆదిలాబాద్, మే 17(ఆంధ్రజ్యోతి): యాసంగి పంటల సాగు సీజన్ దాదాపు గా ముగిసి పోవడంతో రైతులు వానాకాలం సీజన్ పంటల సాగుకు సిద్ధమవుతున్నారు. జిల్లాలో మే చివరి మాసంలోనే వానాకాలం పంటల సాగుకు శ్రీకారం చుడుతారు. ఇప్పటికే వేసవి దుక్కులను పూర్తి చేసిన రైతులు పంట చేన్లను చదును చేసుకుంటున్నారు. వారం రోజుల్లో ఎప్పుడు తొలకరి వర్షం కురిసిన విత్తనాలను విత్తేందుకు సిద్ధమవుతున్నారు. రైతులు ఎరువులు, విత్తనాలను కొనుగోలు చేస్తూ నిల్వ చేసుకుంటున్నారు. అయితే అన్నదాతల అవసరాన్ని అసరాగా చేసుకుంటున్న కొందరు వ్యాపారులు నకిలీ విత్తనాలను అంటగట్టే ప్రయత్నం చేస్తున్నారు. ప్రతియేటా జిల్లాలో నకిలీ పత్తి, సోయా విత్తనాల బెడద తప్పడం లేదు. ఎన్ని రకాలుగా కట్టడి చర్యలు తీసుకుంటున్న వ్యాపారులు గుట్టుచప్పుడు కాకుండా నకిలీ విత్తనాల విక్రయాలను జోరుగా జరుపుతున్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం రైతుబంధు పథకం కింద పెట్టుబడి సహాయాన్ని అందిస్తున్న అది ఏ మూలాన సరిపోవడం లేదని రైతులు చెబుతున్నారు. దీంతో ఉద్దెరపై ఎరువులు, విత్తనాలను కొనుగోలు చేసేందుకు వ్యాపారులు, దళారుల వద్దకు పరుగులు తీస్తున్నారు. ప్రతియేటా జిల్లాలో జరుగుతున్న దళారీ దందా జగమెరిగిన సత్యమే అయినప్పటికీ.. అధికార యంత్రాంగం అడ్డుకట్ట వేయలేక పోతోందన్న ఆరోపణలు వస్తున్నాయి. ముఖ్యంగా మారుమూల గిరిజన గ్రామాల్లో దళారిదందా జోరుగా సాగుతుంది. రైతుల అమాయకత్వాన్ని అసరాగా చేసుకుంటూ అందినకాడికి దండుకుంటున్నారు. జిల్లా కేంద్రానికి చెందిన ఒకరిద్దరు బడా వ్యాపారులు మండల కేంద్రాలతో పాటు అయా గ్రామాల్లో తమ ప్రతినిధులను నియమించుకొని వారి ద్వారా రైతులకు ఎరువులు, పెస్టిసైడ్ మందులను అంటగడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 300పైగా ఎరువులు, విత్తన దుకాణాలు ఉన్నప్పటికి అనాధికారికంగా గ్రామాల్లో మరెన్నో దుకాణాలు కొనసాగుతున్నాయి. అయిన అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. అధికారుల నిరంతర పర్యవేక్షణ లేక పోవడంతో ఇష్టారాజ్యంగా ఎరువులు, విత్తనాల అమ్మకాలు జరుగుతున్నాయి. చాలా చోట్ల బయోమెట్రిక్ విధానం అమలు కాక పోవడంతో విచ్చలవిడిగా ఎరువు మందులు బ్లాక్ మార్కెట్‌లోకి తరలి పోతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారులు విక్రయాలు జరుపుతున్న వ్యవసాయ శాఖాధికారులు మాములుగానే తీసుకోవడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఉద్దెర పేరుతో అధిక వడ్డీ

పంటల సాగు సమయంలో ఉద్దెరపై ఎరువులు, విత్తనాలను అందిస్తున్న దళారులు.. పంట చేతికి రాగానే దానికి రెండింతలుగా దండుకుంటున్నారు. ఉద్దెర పేరుతో 25శాతం అధికవడ్డీని వసూలు చేస్తున్నారు. జిల్లాలో వందలాది మంది దళారులు సీజన్‌లో రైతులకు అధిక వడ్డీలకు రుణాలు ఇస్తూ రూ.కోట్లు గడిస్తున్నారు. జిల్లాలో ప్రతియేటా గుట్టుచప్పుడు కాకుండా కోట్ల రూపాయల అక్రమ దందా నడుస్తోంది. నగదుకు ఒక రేటు.. ఉద్దెరకు మరో రేటును నిర్ణయిస్తున్నారు. ఒక్కో ఎరువుల బస్తాపై రూ.30 నుంచి రూ.50 వరకు అదనంగా వసూలు చేస్తున్నారు. పంట చేతికి రాగానే అసలుతో పాటు అధిక వడ్డీని అదనంగా వసూలు చేస్తున్నారు. ఏదో గత్యంతరం లేక అరువుపై ఎరువు లు, పురుగు మందులను తీసుకుంటున్న రైతులు వ్యాపారుల నిలువు దోపిడీని ప్రశ్నించ లేకపోతున్నారు. కొన్ని సందర్భాల్లో ఇదేమిటని ప్రశ్నిస్తే దురుసుగా ప్రవర్తిస్తూ తమ వద్ద ఎరువులు, విత్తనాలు లేవంటూ తిప్పి పంపుతున్నారు. పలుమార్లు వ్యవసాయ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసిన ఫలితం లేదంటున్నారు. ఏ కారణం చేతైనా సకాలంలో అప్పు చెల్లింకుంటే తమ ప్రతినిధులతో బెదిరింపులకు దిగుతూ వసూలుకు ఎగబడుతున్నారు. జిల్లాలో పెరిగిపోతున్న ఫర్టిలైజర్ దుకాణాల యజమానుల ఆగడాలకు అధికారులు సైతం వత్తాసు పలకడంతో అక్రమదందాకు అడ్డూ అదుపు లేకుండా పోయిందన్న విమర్శలు వస్తున్నాయి.

జిల్లాకు చేరిన నకిలీ విత్తనాలు

ఇన్నాళ్లు అధికారులు ఎన్నికల హడావుడిలో ఉండడంతో కొందరు వ్యాపారులు గుట్టుచప్పుడుకాకుండా జిల్లాకు నకిలీ విత్తనాలను చేరవేసినట్లు తెలుస్తుంది. ఇప్పటికే గ్రామాల్లో డంపు చేసిన విత్తనాలను రైతులకు అంటగట్టే ప్రయత్నం చేస్తున్నారు. అధిక దిగుబడుల పేరిట నకిలీ విత్తనాలను అమ్మేందుకు వ్యాపారులు ప్రయత్నాలు మొదలు పెట్టారు. నిషేధిత లూజు విత్తనాల విక్రయాలపై ఆంక్షలు ఉన్నప్పటికీ విచ్చలవిడిగా విక్రయాలు జరుపుతున్నారు. బీటీ-3 పేరిట లూజు విత్తనాలను యథేచ్ఛగా అమ్మేస్తున్నారు. ఈ విత్తనాలపై రైతులే ఆసక్తి చూపడంతో వ్యాపారులకు మరింత అనుకూలంగా మారింది. కొందరు రైతులు గ్రూపులుగా ఏర్పడి వ్యాపారులకు సమాచారం ఇవ్వడంతో కావాల్సిన విత్తనాలను గ్రామాల్లోకే చేరవేస్తున్నారు. కొన్ని సందర్భాల్లో కొరతను సృష్టించి మరీ అధిక ధరలకు అమ్మేస్తున్న దాఖలాలు కూడా లేకపోలేదు. అధికారులు ఫర్టిలేజర్ దుకాణాల తనిఖీలపై మాత్రమే దృష్టి సారిస్తున్నారే తప్ప నిషేధిత నకిలీ విత్తనాలతో వాటిల్లే నష్టాలపై రైతుల్లో అవగాహన కల్పించలేక పోతున్నారు. రైతులను చైతన్యవంతులను చేస్తేనే నకిలీ విత్తనాల విక్రయాలకు అడ్డుకట్ట పడే అవకాశం ఉంటుంది. గతంలో నకిలీ విత్తనాల బెడదతో వేల ఎకరాలలో పంట నష్టం జరిగింది. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒడిస్సా రాష్ట్రాల నుంచి పత్తి, సోయా విత్తనాలను దిగుబడి చేసుకుంటూ అధిక ధరలకు అంటగడుతున్నారు.

ముందుచూపు కరువు

ప్రతియేటా జిల్లాలో నకిలీ విత్తనాల జోరు కనిపిస్తున్నా.. అడ్డుకట్ట పడడం లేదు. వ్యవసాయ శాఖాధికారులకు ముందుచూపు లేకపోవడంతోనే రైతులు నష్టపోవాల్సి వస్తుందన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఈ యేడు గత వారం రోజుల వరకు ఎన్నికల విధుల్లో బిజీబిజీగా ఉన్న అధికారులు నకిలీ విత్తనాల సరఫరాపై దృష్టి సారించినట్లే కనిపించడం లేదు. ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్ బృందాల తనిఖీలు కూడా కొరవడుతున్నాయి. గతంలో నకిలీ విత్తనాలను విక్రయిస్తూ పట్టుబడిన వ్యాపారులు మళ్లీ అదే వ్యాపారంలో కొనసాగడంతో నకిలీ విత్తన ముప్పు తప్పడం లేదు. నిబంధనలకు విరుద్ధంగా విత్తనాలను విక్రయించిన వ్యాపారుల లైసెన్సులను పూర్తిగా రద్దు చేయాల్సి ఉండగా.. అలాంటి దాఖలాలు జిల్లాలో కనిపించడం లేదు. నామమాత్రంగానే చర్యలు తీసుకుంటూ వదిలేయడంతో నకిలీ విత్తనాల దందా విచ్చలవిడిగా కొనసాగుతూనే ఉంది. పలు గ్రామాల్లో ఎలాంటి అనుమతులు లేకుండానే కమీషన్‌పై కొందరు దళారులు ఎరువులు, విత్తనాల దందాను చేస్తున్నారు. ఒకేసారి పెద్దమొత్తంలో ఎరువులు, ఫెస్టిసైడ్ మందులను నిల్వ చేసుకుంటూ రైతులకు ఉద్దెరపై అధిక ధరలకు అంటగడుతున్నారు. గ్రామంలో పలుకుబడితో పాటు ఆర్థిక స్తోమత ఉన్న వ్యక్తులు ఈ దందాకు ఎగబడుతున్నారు. ఇళ్లలోనే ఎరువులను భారీగా నిల్వలు చేసుకుంటూ జీరో దందా చేస్తున్నారు. అమ్మకపు రషీదులు ఇవ్వకుండానే విక్రయాలు జరుపుతున్నారు. ఏదైనా తేడా వస్తే తమకేమీ తెలియదని చేతులెత్తేస్తున్నారు.

జిల్లాలో అన్నిరకాల కట్టడి చర్యలు తీసుకుంటున్నాం

: శివకుమార్, ఏవో, ఆదిలాబాద్

జిల్లాలో నకిలీ విత్తనాలను కట్టడి చేసేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే ఫర్టిలైజర్ విత్తన దుకాణాలను తనిఖీ చేయాలని మండల స్థాయి అధికారులకు ఆదేశాలు ఇవ్వడం జరిగింది. అలాగే టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేసి జిల్లాకు నకిలీ విత్తనాల సరఫరాను అడ్డుకడుతున్నాం. రైతులు అప్రమత్తంగా ఉంటూ జాగ్రత్తగా ఒకటికి రెండుసార్లు పరిశీలించిన తర్వాతనే విత్తనాలను కొనుగోలు చేయాలి. వ్యాపారుల నుంచి తప్పనిసరిగా రషీదు తీసుకోవాలి.

సంక్షిప్త సమాచారం

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తులు

మావల, మే 17: ఐటీఐలో ఇంజనీరింగ్, నాన్ ఇంజనీరింగ్ ట్రేడ్‌లలో శిక్షణ పొందటానికి అభ్యర్థుల నుంచి ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సుజాత ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు 10వ, 8వ తరగతి ఉత్తీర్ణులై 14 ఏళ్లు నిండి ఉండాలన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తు కోసం ప్రభుత్వ ఐటీఐ, ప్రైవేట్ ఐటీఐలను సమర్పించవచ్చన్నారు. అభ్యర్థులకు ఏమైనా సందేహాలుంటే ఫోన్ నెం.9493535378 ద్వారా కళాశాల పని వేళల్లో సంప్రదించాలని కోరారు.

నేటి నుంచి సినిమా థియేటర్ల బంద్

ఆదిలాబాద్ అర్బన్, మే 17: సినిమా థియేటర్ల అక్యుపెన్సీ పడిపోవడంతో యజమా న్యాలు థియేటర్లను మూసి వేయాలని నిర్ణయం తీసుకున్నారు. శుక్రవారం నుంచి ఈనెల 23వ తేదీ వరకు వాటిని మూసి వేస్తున్నట్లు ప్రకటించాయి.ఇందులో భాగంగా పట్టణంలోని ఏసీయన్ నటరాజ్, డిలక్స్ థియేటర్లు మూసి ఉంచారు.రెండు నెలలుగా కొత్త సినిమాలు విడుదల కాక పోవడంతో ప్రేక్షకులు థియేటర్లకు వచ్చేందుకు నిరాకరిస్తున్నారు. కనీసం సింగిల్ స్క్రీన్ థియేటర్లకు రోజుకు వంద మంది కూడా రాని పరిస్థితి నెలకొందని, దీంతో కరెంట్ ఖర్చులకు కూడా డబ్బులు రావడం లేదని యజమాన్యాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. ఈ క్రమంలోనే పదిరోజుల పాటు థియేటర్లను మూసివేయాలని నిర్ణయం తీసుకున్నాయి. దీంతో పట్టణంలోని థియేటర్ల యజమానులు కూడా ఈనెల23 వరకు థియేటర్‌ను మూసి వేస్తున్నట్లు తెలియజేస్తూ నోటీసు బోర్డు పెట్టారు.

ఆత్మీయ సమ్మేళనం

ఆదిలాబాద్ అర్బన్, మే 17: డైట్ కళాశాలలో 1998-98 బ్యాచ్ ఛాత్రోపాధ్యాయులు 25 ఏళ్ల తర్వాత ఒకేచోట చేరి సంబరాలు జరుపుకున్నారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో చదువుకున్న సమయంలో చేసిన అల్లరి, ప్రస్తుతం చేస్తున్న వృత్తుల గురించి చర్చించారు. ఈ సందర్భంగా వారికి బోధించిన అధ్యాపకులను సత్కరించి వారి ఆశీర్వచనలు తీసుకున్నారు. బ్యాచ్‌లో 120మంది ఉండగా.. కొందరు ఇతర శాఖల్లో ఉండగా మిగత వారు ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతున్నారు. అందరు ఒకే వేదికపై శుక్రవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఉత్సాహంగా గడుపుతు పాత రోజులను నెమరు వేసుకున్నారు. ఇందులో ఊర్మిల, భాగ్య, వీణ, కవిత, జయసుధ, ప్రవీణ్, భగవండ్లు, శ్రీనివాస్, ఆనంద్, స్వామి రెడ్డి, విజయ్, చింతమన్, తదితరులు పాల్గొన్నారు.

'అక్రమ అరెస్టులు అప్రజాస్వామికం'

ఉట్నూర్, మే 17: ఆదివాసీ యువకుడిపై జరిగిన దాడికి నిరసనగా ఐటీడీఏ పీవోకి వినతిపత్రం ఇవ్వడానికి వస్తున్న ఆదివాసీ ఉద్యమకారులు కోవా విజయ్‌కుమార్, కనకయాదవ్‌రావ్, మడావి శంకర్‌లను పోలీసులు అక్రమంగా అరెస్టు కస్టడీలో ఉంచుకోవడంపై తుడందెబ్బ జిల్లా అధ్యక్షుడు పుర్క బాపురావ్ తీవ్రంగా మండిపడ్డారు. మండలకేంద్రంలో ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ఆదివాసీ యువకుడిపై దాడికి నిరసనగా ఐటీడీఏ పీవోకి వినతిపత్రం ఇవ్వడానికి వస్తున్న వారిని అదుపులో తీసుకోవడం అప్రజాస్వామికం అన్నారు. జైనూర్ మండలకేంద్రంలోని ఈనెల 13న ఆదివాసీ యువకుడు మర్సుకోల లక్ష్మణ్‌పై దాడి చేసిన వారిని గుర్తించి కఠినంగా చర్య తీసుకోవాలని, అరెస్టు చేసిన నాయకులను భేషరతుగా విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని జిల్లా అధ్యక్షుడు హెచ్చరించారు.

అమ్మ ఆదర్శ పాఠశాలల్లో..

10లోగా పనులను పూర్తి చేయాలి

● అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ రాజార్షిషా



ఆదిలాబాద్ అర్బన్, మే 17: అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ద్వారా చేపట్టాల్సిన కనీస మౌళిక వసతులకు సంబంధించిన పనులను జూన్ 10లోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాజార్షిసా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో విద్య, పంచాయతీ, డీఆర్‌డీఓ, సీఈఓ, మున్సిపల్, పీఆర్, డీఎల్‌పీఓస్, ఈఈలు, డీఈఈలు, ఏఈఈలు, పెయింటింగ్స్ ఏజెన్సీలతో అమ్మ ఆదర్శ పాఠశాలలో చేపడుతున్న పనుల పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సెలెక్ట్ చేసిన మొత్తం 678లో 668 కమిటీ ఏర్పాటై అకౌంట్ ఓపెన్ చేయడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీటి సౌకర్యం, టాయిలెట్స్, ఎలక్ట్రిసిటీ పెయింటింగ్, బెంచీలు, గ్రీన్‌చాక్ బోర్డు, మేజర్ మైనర్ మరమ్మత్తులు, పాఠశాలలో మౌళిక వసతుల కల్పనకు చేపట్టవల్సిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపడుతున్న పనులు నాణ్యతలో రాజీపడకుండా పనులు చేపట్టాలని సూచించారు.పాఠశాలల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలని, పాఠశాలల్లో తలుపులు, కిటికీలు, ఫ్లోరింగ్ తదితర వాటిని రిపేర్ చేయించుకోవాలన్నారు.టాయిలెట్స్ లేని చోట కొత్త వాటిని నిర్మాణం చేసి, పాఠశాలల్లో పనులు చేపట్టక ముందు, పనులు చేపట్టిన తర్వాత వాటి ఫోటోలను తీసి పంపించాలని తెలిపారు. మండలాల వారీగా ఒక్కొక్కరిని వారి పరిధిలో ఉన్న పాఠశాలల పురోగతిని అడిగి తెలుసుకుని, ఎక్కడెక్కడ ఇంకా పనులు ప్రారంభంచ లేదో వాటిని జూన్ 10లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. జూన్ 12న పాఠశాలు ప్రారంభించడం జరుగుతుందని ఆలోపే పనులన్ని పూర్తి చేయాలన్నారు. ఇందుల ట్రైనీ కలెక్టర్ అభిజ్ఞాన్, డీఈఓ ప్రణీత, సంబంధిత శాఖాధికారులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఆయా శాఖల అధికారులు (ఇన్‌సెట్‌లో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాజార్షిషా)

ఆదివాసీల అస్తిత్వంపై దాడులు చేస్తే సహించం

● ఐటీడీఏ గేటు మూసివేత ● పోలీసుల మోహరింపు ● పీవోను కలిసిన ఆదివాసీ నాయకులు ● చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం : పీవో



కాపలాగా ఉన్న పోలీసులు

ఉట్నూర్, మే 17: ఉమ్మడి జిల్లాలోని ఆదివాసీ గిరిజనుల అస్తిత్వంపై ఎవరైనా దాడులు చేస్తే సహించబోమని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోడం గణేష్ హెచ్చరించారు. ఉమ్మడి జిల్లాలోని జైనూర్ మండల కేంద్రంలో ఈనెల 13న ఆదివాసీ గిరిజనుడు మరుసుకోల లక్ష్మణ్‌పై ఒక వర్గం వారు దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటనపై ఉట్నూర్ ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తను శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతంలో కొందరు అమాయక ఆదివాసీ మహిళలపై, గిరిజనులపై దాడులు చేస్తూ హింసకు పూనుకుంటున్నారని అన్నారు. ఆదివాసీ యువతులను మభ్యపెట్టి ప్రేమించి పెళ్లి చేసుకోవడంతో పాటు ఇబ్బందులకు గురి చేస్తున్నారని, మరికొందరు భూములను ఆక్రమిస్తున్నారని అన్నారు. గిరిజన ప్రాంతాల్లో ఉన్న చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని అన్నారు. ఆదివాసీలపై దాడులు జరుగుతున్నా.. ప్రభుత్వాలు కిమనకుండా ఉండడం వల్ల ఆదివాసీల మనుగడకు ముప్పు ఏర్పడుతుందన్నారు. మర్సుకోల లక్ష్మణ్‌పై ఒక వర్గం వారు దాడి చేసి తీవ్రంగా గాయపరిచారని, వారిపై హత్యాయత్నం కేసుతో పాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్టు ప్రకారం కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లక్ష్మణ్‌కు ఏమైనా జరిగితే సహించబోమన్నారు. లక్ష్మణ్ కుటుంబానికి ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని అన్నారు.

● ఐటీడీఏ వద్ద బందోబస్తు

జైనూర్ సంఘటనను ఐటీడీఏ పీఓ దృష్టికి తెచ్చి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పేర్కొంటూ ఆసిఫాబాద్ తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు కోవ విజయ్ ఆధ్వర్యంలో శుక్రువారం ఐటీడీఏకు వస్తామని ప్రకటించడంతో ముందస్తుగానే ఆసిఫాబాద్ జిల్లా పోలీసులు వారిని అదుపులో తీసుకున్నారు. దీంతో ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్, సీఐలు గండికోట మొగిలి, రహీం, ఉట్నూర్, ఇంద్రవెల్లి, నార్నూర్, గాదిగూడ, ఎస్సైలు మనోహర్, దుబ్బాకసునిల్, రవికుమార్, గాలి మహేశ్‌లతో పాటు సివిల్, ప్రత్యేక పోలీసులతో ఐటీడీఏ ముందు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆసిఫాబాద్ నాయకుల అరెస్టు దృశ్య ఆదిలాబాద్ జిల్లా తుడుందెబ్బ నాయకులు ఉట్నూర్ ఐటీడీఏకు చేరుకోవడంతో డీఎస్పీ నాగేందర్ వారితో మాట్లాడిన అనంతరం ఇద్దరు సీఐలు, ఇద్దరు ఎస్సైల ఆధ్వర్యంలో ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్తను కలుసుకున్నారు.



ఐటీడీఏ పీవోకు వినతిపత్రం అందజేస్తున్న తుడుందెబ్బ నాయకులు

● చట్టం ప్రకారం చర్యలు : పీవో

జైనూర్ సంఘటనకు బాధ్యులైన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఐటీడీఏ పీవో స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఐటీడీఏ పీవోకు తుడుందెబ్బ నాయకులు వినతిపత్రం అందజేశారు. పలు విషయాలను పీవో దృష్టికి తెచ్చారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఐటీడీఏ గిరిజనులది, మీరు ఎప్పుడైనా రావచ్చు, ఎప్పుడైనా వెళ్లొచ్చు, కానీ ఎన్నికల కోడ్ అమలులో ఉండడం వల్ల పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జైనూర్ సంఘటన బాధాకరమని, బాధ్యులను గుర్తించి ఆసిఫాబాద్ జిల్లా పోలీసు సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. గతంలో ఐటీడీఏపై దాడి జరగడానికి ప్రభుత్వం అధికారుల నిర్లక్ష్యం కారణమని గోడం గణేష్ వివరించారు. అర్హులైన వారికి పోడు భూముల పట్టాలు రాకపోవడం, చనిపోయిన వారి కుటుంబాలకు విరాసత్ చేయకపోవడం వల్ల నిరాశకు గురైన కొందరు ఐటీడీఏపై దాడి చేశారని అన్నారు. ఎన్నికల కోడ్ ముగియగానే గిరిజనుల సమస్యలపై చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్రం గణపతి, కుమ్ర జంగు, వెట్టి మనోజ్, కుమురం రేణుక, పెందూర్ పుష్పారాణి, పెందూర్తి దాదిరావు, సలాం వరుణ్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వేదిక జిల్లా అధ్యక్షుడు బొర్రన్న

నకిలీ విత్తనాలు రాకుండా కట్టడి చేయాలి

● రైతు స్వరాజ్ వేదిక

బోథ్, మే 17: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో నకిలీ విత్తనాలు రాకుండా వ్యవసాయ అధికారులు చేయాలని రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న అధికారులను కోరారు. మండలం మహారాష్ట్ర సరిహద్దులో ఉండటం వల్ల అక్కడి నుంచి నకిలీ విత్తనాలు మార్కెట్‌కు వచ్చే అవకాశం ఉందన్నారు. కొన్ని రకాల పత్తి విత్తనాలు సోయాబీన్ విత్తనాలు గతంలో నాసిరకమైనవి, నకిలీవి రావడం వల్ల రైతులను నష్టపోయారన్నారు. అధికారులు పటిష్ఠమైన నిఘా వ్యవస్థ ఏర్పాటు చేసి నకిలీ విత్తనాలకు కట్టడి చేయాలన్నారు. విలేకరుల సమావేశంలో రైతులు జి.రాజేశ్వర్‌రెడ్డి, నారాయణ స్వామి, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

'లైసెన్స్ షాపుల్లోనే విత్తనాలు తీసుకోవాలి'

గుడిహత్నూర్, మే 17: లైసెన్స్‌లు కలిగి ఉన్న ఫర్టిలైజర్ షాపుల్లో విత్తనాలు, ఎరువులు తీసుకుని రసీదులు తప్పకుండా తీసుకోవాలని ఏవో రేవతి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతులు విత్తన డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఏవో మాట్లాడుతూ పంట కాలం అయిపోయే వరకు రసీదులను జాగ్రత్తగా రైతులు తమ దగ్గర ఉంచుకోవాలని సూచించారు. పెద్ద వర్షాలు పడిన తరువాత విత్తనాలు నాటాలన్నారు. విత్తనాల డీలర్లు విత్తన స్టాక్, అమ్మకం వివరాలు ప్రతీరోజు మండల వ్యవసాయ శాఖ అధికారికి తెలపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవో వెంకట్ రావు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

'దోస్త్ ప్రవేశం కోసం దరఖాస్తులు'

ఆదిలాబాద్ అర్బన్, మే 17: ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పూర్తిస్థాయి వసతులతో పాటు పీజీ చేసిన అనుభవం కలిగిన అధ్యాపకులతో బోధనలు జరుగుతున్నాయని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సైన్సెస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయా డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లతో కలిసి దోస్త్ ద్వారా డిగ్రీలో ప్రవేశం కోసం దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. దోస్త్‌లో దరఖాస్తు చేసుకునే విధానాన్ని తెలిపారు. ఈ సందర్భంగా డిగ్రీ కళాశాల సైన్సెస్ ప్రిన్సిపాల్ మాట్లాడుతూ జిల్లాలో నాలుగు ప్రభుత్వ డిగ్రీ కళాశాల లున్నాయని తెలిపారు. ఇంటర్‌పాస్ అయిన విద్యార్థులు దోస్తు ద్వారా డిగ్రీలో అడ్మిషన్ల కోసం వెబ్ ఆప్షన్లను ఎంచుకోవాలని సూచించారు. ప్రభుత్వ కళాశా లల్లో అనుభవజ్ఞులైన అధ్యాపకులతో బోధనలు చేయిస్తున్నామ న్నారు. దీంతో పాటు ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ లాంటి కార్యక్రమాలతో వృత్తి నైపుణ్యంలో కూడా శిక్షణలు ఇస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ ఉన్నతంగా రాణించాలని ఆకాంక్షించారు. దోస్తులో దరఖాస్తు చేసుకునే వారికి కళాశాలలో హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. ఇందులో ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జలగం అనిత, ఉట్నూర్ డిగ్రీకళాశాల ప్రిన్సిపల్ స్వామి, అధ్యాపకులు ప్రభాత్ రావు, దోస్తు కో ఆర్డినేటర్ డాక్టర్ నర్సింగ్‌రావు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శ్రీనివాస్